ప్రజాశక్తి

బుధవారం 26 జులై 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అంతా ఏకపక్షం

◆ కనీస చర్చ లేకుండానే జివిఎంసి కౌన్సిల్‌లో అజెండా అంశాలు ఆమోదం

◆ విపక్షాల గోడు పట్టని వైనం ◆ టిడిపి కార్పొరేటర్లు నిరసన, సస్పెన్షన్

◆ చెత్తపై యూజర్ ఛార్జీల వసూలు దారుణం : గంగారావు

మేయర్ పోడియం వద్ద టిడిపి కార్పొరేటర్ల నిరసన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశం ఏకపక్షంగా సాగింది. అజెండాలో పొందుపరిచిన అంశాలపై కనీస చర్చ లేకుండా ఏకపక్షంగా అన్ని అంశాలనూ 'అధికార' బలంతో ఆమోదింపజేసుకున్నారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 98 వార్డులలో సమస్యలు, అభివృద్ధి, ప్రణాళికలపై సాధారణ అజెండాలో 44 అంశాలు, సప్లిమెంటరీ అజెండాలో 41 అంశాలు, టేబుల్ అజెండాలో 7 అంశాలు కలుపుకొని మొత్తం 92 అంశాలపై పలు ప్రతిపాదనలు చేయగా అన్ని అంశాలనూ అధికార వైసిపి కార్పొరేటర్ల కనుసన్నల్లో నగర మేయర్ గొలగాని హరి వెంకట మిగతా 2లో..

ప్రజా సమస్యలపై గళమెత్తిన సిపిఎం కార్పొరేటర్ గంగారావు

సమస్యలపై ప్రశ్నిస్తున్న గంగారావు

సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పలు సమస్యలపై గళం వినిపించారు. గాజువాకలోని కొన్ని ప్రాంతాల్లో అమ్మఒడి పథకం విషయంలో ఎలా ఇబ్బంది పెడుతున్నారో తెలిపారు. చెత్తపై యూజర్ ఛార్జీల విషయం కోర్టులో కేసులు ఉన్నప్పటికీ ప్రజలకు నష్టం చేకూర్చే చర్యలు చేపట్టడం మిగతా 2లో..

తగ్గిన చెరుకు సాగు

◆ మూడు ఫ్యాక్టరీల మూతతో ఇతర పంటలవైపు రైతుల మొగ్గు

◆ ప్రభుత్వ ప్రోత్సాహం కరువు

బుచ్చయ్యపేటలో సాగులో ఉన్న చెరుకు పంట

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో వరి తరువాత ప్రధాన పంట అయిన చెరుకు సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. నాలుగు సహకార చక్కెర ఫ్యాక్టరీల్లో మూడు ఫ్యాక్టరీల క్రషింగ్ ప్రభుత్వం నిలిపివేయడం, పెట్టుబడులు పెరగడం, గిట్టుబాటు ధర లేకపోవడం, బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో రైతులు చెరుకు సాగుపై ఆసక్తి చూపడంలేదు. సాగు విస్తీర్ణం తగ్గడంతో ఈ ఏడాది గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ తగ్గనుంది. ఉద్దేశపూర్వకంగానే సహకార చక్కెర ఫ్యాక్టరీలను ప్రభుత్వం దెబ్బతీసి తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీల క్రషింగ్‌ను దశలవారీగా నిలిపివేసింది. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ కూడా నిలిపివేసేలా ప్రభుత్వ చర్యలున్నాయి. సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించి, క్రషింగ్ సామర్థ్యం పెంచడంతో పాటు ఉప ఉత్పత్తుల యూనిట్లను నెలకొల్పాలన్న రైతుల డిమాండ్‌ను పక్కనబెట్టి ఫ్యాక్టరీల ఆస్తులు అమ్మి సొమ్ము చేసుకోవాలని ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. మూడు సుగర్ ఫ్యాక్టరీల మూత, గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించకపోవడంతో లక్ష ఎకరాలకుపైగావున్న చెరుకు సాగు 13,299 ఎకరాలకు మిగతా 2లో..

ఒఐఎల్‌తో ఐఐపిఇ ఒప్పందం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ ఆధ్వర్యంలో నోవాటెల్ హోటల్‌లో హైడ్రోజన్‌పై మూడు రోజుల గ్లోబల్ ఎనర్జీ ఎన్విరాన్‌మెంట్ సమ్మిట్ జరిగింది. దీనిలో భాగంగా రెండో రోజైన మంగళవారం విశాఖపట్నంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ, ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఒఐఎల్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఐఐపిఇ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్, ఇఘా కలిత, ఐఐపిఇ ప్రొఫెసర్ కె.విజయకుమార్, ఆర్‌పి.ద్వివేది, మిగతా 2లో..

10 నుంచి విద్యుత్ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్టు ఎపి స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖలో 20, 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గతంలో పాదయాత్ర చేసిన సమయంలో వీరందరినీ పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని, మిగతా 2లో..

గిట్టుబాటు ధరకు మరో ఉద్యమం

▶ వార్త 5లో..

మణిపూర్ మారణహోమానికి బిజెపిదే బాధ్యత

▶ వార్త 8లో..

అణుకు గిరిజనం దీక్షలతో అధికారుల్లో కదలిక

▶ వార్త 8లో..

జోరువాన

విశాఖలో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకూ విడిచి విడిచి జోరు వాన కురిసింది. దీంతో గాజువాక, గోపాలపట్నం, మద్దిలపాలెం, వన్ టౌన్, కంచరపాలెం ఏరియాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. కాలువలు పొంగి ప్రవహించాయి. జోరువానలోనే నగర వాసులు ప్రయాణాలు సాగించారు.



ఒఐఎల్‌తో ఐఐపిఇ ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి..) రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.అపారోయ్, ప్రొఫెసర్ సోమనాథ్ ఘోష్ సమక్షంలో ఇరు సంస్థల నుంచి అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఎంఒయులో భాగంగా ఆయిల్ ఇండియా లిమిటెడ్ రూ.1.25 కోట్లతో ఆర్ అండ్ డి ప్రాజెక్టును ఐఐపిఇకి అప్పగించింది. ఐఐపిఇలోని హ్యుమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం నుంచి కెమిస్ట్రీలో స్పెషలైజేషన్ పొందిన డాక్టర్ కుముద్ ఎం.త్రిపాఠి ఈ సహకార ప్రాజెక్టుకు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా వ్యవహరిస్తారు. బయోమాస్ ఆధారిత గ్రాఫీన్ ఏరోజెల్స్‌ను ఉపయోగించడం ద్వారా కార్బన్ డై ఆక్సైడ్ క్యాప్చర్, గ్రీన్ ఫ్యూయల్‌గా మార్చడంపై ఈ పరిశోధన ప్రాజెక్ట్ దృష్టి పెడుతుంది. గ్రీన్ ఎనర్జీ రంగంలో వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసే దిశగా ఐఐపిఇ, ఒఐఎల్‌ల లక్ష్యానికి అనుగుణంగా ఈ పరిశోధన జరుగనుంది.

10 నుంచి విద్యుత్ ఉద్యోగుల సమ్మె

(మొదటి పేజీ తరువాయి..) ప్రభుత్వం వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఆ హామీని నెరవేర్చలేదని అన్నారు. విద్యుత్ ఉద్యోగులకు 2022 జులై 1 నుంచి ఉన్న డిఎ బకాయిలు చెల్లించాలన్నారు. 2019లో నియమితులైన వారందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఇతర ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేసి, ఎనర్జీ అసిస్టెంట్లను మాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కరోనా సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 140 మంది ఎనర్జీ అసిస్టెంట్లు చనిపోయారని, వారి స్థానంలో కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న విధంగానే తమకు కూడా పెన్షన్ మంజూరు చేయాలన్నారు. సమ్మెకు వెళ్లే ముందు ఈ నెల 27 నుంచి ఆగస్టు 9 వరకు దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా ఆగస్టు 1న అన్నిచోట్లా ర్యాలీలు, 2, 3 తేదీలలో రిలే దీక్షలు, 4, 5, 7 తేదీలలో వర్క్ టు రూల్, 8న విజయవాడలో మహాధర్నా చేపడతామన్నారు. 9న డిపార్టుమెంట్ తమకు ఇచ్చిన సిమ్ కార్డులను తిరిగి వారికి అందజేస్తామన్నారు. 10 నుంచి నిరవధిక సమ్మెకు వెళతామని చెప్పారు. విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల సమ్మె రాష్ట్ర ప్రజలందరికీ ఇబ్బంది కలిగించేదిగా ఉన్నప్పటికీ తప్పనిసరి పరిస్థితిలో సమ్మెకు వెళుతున్నట్లు తెలిపారు. పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. సమ్మె వల్ల పరిశ్రమలకు, ప్రజలకు కలిగే అసౌకర్యానికి ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో జెఎసి చైర్మన్ పి.చంద్రశేఖర్, కన్వీనర్ బి.సాయికృష్ణ, జెఎసి నాయకులు విఎస్ఆర్‌కె.గణపతి, పి.త్రినాథరావు, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, లబ్ధిదారులు

హుదూద్ ఇళ్ల సమస్యపై సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హుదూద్ తుపాను సమయంలో ఇళ్లు కోల్పోయిన వారికి టిడిపి ప్రభుత్వ హయాంలో కొమ్మాది ప్రాంతంలో నిర్మించి, కేటాయించిన సుమారు 224 ఇళ్ళకు కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఎంవిపి కాలనీలోని ఉషోదయ జంక్షన్‌లో వున్న హౌసింగ్ కార్పొరేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.వెంకటరావు ఆధ్వర్యంలో సుమారు 150 మంది బాధితులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పెద్దపెట్టున నినదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమ్మాది వద్ద నిర్మించిన ఇళ్లకు విద్యుత్ కనెక్షన్, తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదని తెలిపారు. అనంతరం పీడీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఆయన సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

కిరండూల్ - కోరాపుట్ లైన్‌లో డిఆర్‌ఎం తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ మంగళవారం కిరండూల్ - కోరాపుట్ సెక్షన్‌ను తనిఖీ చేశారు. డిఆర్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన పర్యటించడం ఇదే తొలిసారి. తనిఖీల్లో భాగంగా సైడింగ్‌లు, రైల్వే కాలనీలు, మైనింగ్ సైట్లను పరిశీలించారు. ట్రాక్, వంపులు, వంతెనలు, పాయింట్లు, క్రాసింగ్ మొదలైన వాటిని తనిఖీ చేయడానికి విండో ట్రైలింగ్ నిర్వహించారు. కిరండూల్ - జగ్‌దల్‌పూర్ డబ్లింగ్ పనులు, సైడింగ్ పనులు, కిరండూల్‌లో ర్యాపిడ్ వ్యాగన్ డిశ్చార్జ్ సైలో సిస్టమ్‌ను నిశితంగా పరిశీలించారు. వెయిటింగ్ హాల్, తాగునీటి సౌకర్యం, ప్రయాణికుల సౌకర్యార్థం తలపెట్టిన పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం కిరండూల్, భాన్సీ, దంతెవాడ, బదేయర్‌పూర్, కమ్లూర్ స్టేషన్లను తనిఖీ చేశారు.

పనులను పరిశీలిస్తున్న డిఆర్‌ఎం

మొదటి పేజీ తరువాయి..

తగ్గిన చెరుకు సాగు

పడిపోయింది. గతేడాది 2.21 లక్షల టన్నుల చెరుకు క్రషింగ్ చేసిన గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఈ ఏడాది రెండు లక్షల టన్నుల క్రషింగ్‌కు పరిమితమవుతుందని అంచనా వేస్తున్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు సాగు తగ్గించి, ఇతర పంటల వైపు రైతులు మొగ్గుచూపడంతో ఈ ఏడాది క్రషింగ్ తగ్గనుంది. 2018-19 సీజన్‌లో తుమ్మపాల, 2021-22 సీజన్ నుంచి ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీల క్రషింగ్ ప్రభుత్వం ఆపేసింది. దీంతో వాటి పరిధిలోని రైతులు చెరుకు సాగు తగ్గించుకుంటూ వస్తున్నారు. ఏటికొప్పాక, తాండవ క్రషింగ్ నిలిపిన ఏడాదిలో 48,605 ఎకరాల్లో చెరుకు సాగు నమోదైంది. ఆ తరువాత ఏడాది 39,623 ఎకరాలకు పడిపోయింది. ఈ ఏడాది 13,299 ఎకరాలకు తగ్గింది. ఇదిలా ఉండగా ఆగస్టు నాటికి మరో రెండు వేల ఎకరాల్లో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు.

ఏటికొప్పాక, తాండవ, తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలు మూతవేయడంతో అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో చెరుకు సాగు గణనీయంగా తగ్గింది. ఈ డివిజన్లకు అందుబాటులోవున్న ఫ్యాక్టరీలు మూతపడ్డంతో వేర్వేరు ప్రాంతాలకు చెరుకు సరఫరా చేయలేక రైతులు సాగు తగ్గించుకున్నారు. వ్యవసాయాధారిత జిల్లాలో చెరుకు సాగుకు మంచి అవకాశాలున్నప్పటికీ ప్రభుత్వాల ప్రోత్సాహం లేకపోవడంతో చెరుకు సాగు వదులుకొని ఇతర పంటల వైపు మొగ్గుచూపుతున్నారు.

జిల్లాలో 2021 నుంచి 2023 వరకు వ్యవసాయశాఖ డివిజన్ల వారీగా చెరుకు సాగు వివరాలు (ఎకరాల్లో)

	2021		2022		2023	
డివిజన్	సాధారణం	నమోదు	సాధారణం	నమోదు	సాధారణం	నమోదు
అనకాపల్లి	11,330	6,665	10,397	4,755	9,002	1030
యలమంచిలి	5957	3170	5025	1,517	3,887	300
చోడవరం	36,812	29,690	35,437	24,667	32,912	8,895
పాయకరావుపేట	3,565	1015	2,640	567	1767	52
నర్సీపట్నం	16,560	8065	14,425	8,117	12,440	3,022
మొత్తం	**74,224**	**48,605**	**67,924**	**39,623**	**60,008**	**13,299**

అంతా ఏకపక్షం

కుమారి ఏకపక్షంగా ఆమోదించారు. పలు అంశాలపై చర్చించాలని టిడిపి, జనసేన, సిపిఎం కార్పొరేటర్లు పట్టుబట్టినా వారి మాటకు కనీసం విలువ ఇవ్వలేదు. పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలియజేసిన టిడిపి కార్పొరేటర్లపై మేయర్ సభ నుంచి సస్పెన్షన్ విధించారు. అనంతరం సాధారణ అజెండాతోపాటు సప్లమెంటరీ అజెండాలోని 14 అంశాలు కేవలం వైసిపి కార్పొరేటర్ల మద్దతుతో ఆమోదం పొందాయి. విరామం అనంతరం టిడిపి కార్పొరేటర్లపై సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్టు మేయర్ ప్రకటించడంతో నిరసనలు ఆపివేసిన టిడిపి కార్పొరేటర్లు మిగిలిన అంశాలపైనైనా చర్చ జరగాలని కోరినప్పటికీ మేయర్ ఏకపక్షంగా వైసిపి కార్పొరేటర్లకు మద్దతుగా నిలిచి అంశాలను ఆమోదింపజేశారు.

సమావేశం సాగిందిలా..

ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కౌన్సిల్ సమావేశం మధ్యాహ్నం 2 గంటల వరకు జీరో అవర్‌తోనే కొనసాగింది. అధికార వైసిపి కార్పొరేటర్లు, ప్రతిపక్ష టిడిపి, జనసేన, సిపిఎం కార్పొరేటర్లు వారివారి వార్డుల్లోని సమస్యలను చెప్పుకొచ్చారు. వైసిపి కార్పొరేటర్ పీవీ సురేష్ అధికార పార్టీ డిప్యూటీ మేయర్‌పైనే భూకబ్జాలు చేశారంటూ ఆరోపణలు చేశారు. 56వ వార్డు కార్పొరేటర్ రాజశేఖర్ మాట్లాడుతూ తమ వార్డులో ఉన్న ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రంలో కనీసం మందులు కూడా లభించడం లేదని తెఇపారు. 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ మాట్లాడుతూ పరిశ్రమల వల్ల వెలువడే వ్యర్థాల మూలంగా తమ వార్డు పరిధిలోని తాడి గ్రామ ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల కార్పొరేటర్లు గత కౌన్సిల్ సమావేశాలలో లేవనెత్తిన సమస్యల పరిష్కారం ఎంతవరకు వచ్చిందన్న విషయాన్ని తమకు తెలియజేయాలంటూ పట్టుబట్టారు. భోజన విరామం అనంతరం ప్రారంభమైన కౌన్సిల్ సమావేశంలో అంశాలన్నీ ఏకపక్షంగా ఆమోదించడం ప్రారంభించారు ఈ అంశాలలో ముఖ్యంగా మెకానికల్ విభాగానికి చెందిన ట్రాక్టర్ స్వీపింగ్ మిషన్ వాహనాల మెయింటెనెన్స్‌కు ఏడాదికి సుమారు రూ.50 లక్షల ఖర్చు అవుతుందన్న ప్రతిపాదనతో విపక్ష పార్టీలు ఏకీభవించలేదు. సిపిఎం కార్పొరేటర్ గంగారావు రూ.50 లక్షల పద్దుకు వివరాలు తెలపాలని కోరినప్పటికీ అధికారులు తెలపలేదు దీంతో ప్రతిపక్ష పార్టీలైన టిడిపి, సిపిఎం, జనసేన కార్పొరేటర్లు పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలియజేశారు. అయినప్పటికీ మేయర్ ఏకపక్షంగా ఆమోదించారు.

ప్రశ్నిస్తున్న గణబాబు

పెండింగ్ సమస్యలను పరిష్కరించండి : గణబాబు

పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు కోరారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గెడ్డల్లో పూడికలు తీయాలని కోరారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు : ముత్తంశెట్టి

తన నియోజకవర్గ పరిధిలోని వార్డుల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మధురవాడ పరిధి హౌసింగ్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో ఎదురవుతున్న ఇబ్బందులను తెలిపారు.

వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తాం : కమిషనర్

నగరంలోని వీధి దీపాల సమస్యపై జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ వివరణ ఇచ్చారు. నగరంలో 10622 వీధి లైట్లు మాత్రమే వెలగడం లేదని తెలిపారు. సమస్యను పరిష్కరించేందుకు 166 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని వెల్లడించారు. గతంలో పనిచేసిన కాంట్రాక్టర్‌కు బకాయిలు ఉండటంతో సహకరించలేదని తెలిపారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

సమస్యలపై గళమెత్తిన గంగారావు

(మొదటి పేజీ తరువాయి..) దారుణమన్నారు. సచివాలయ ఉద్యోగులను బలవంతంగా యూజర్ ఛార్జీలు వసూలు చేయాలని ఆదేశించడం తగదన్నారు. జివిఎంసి యంత్రాంగం ఈ సమస్యపై వెంటనే స్పందించి బలవంతపు వసూళ్లను ఆపాలని డిమాండ్ చేశారు. కొన్ని ప్రాంతాలలో వృద్ధులకు ఇచ్చే పెన్షన్‌కు చెత్త పన్నుతో లింకు పెడుతున్నారని తెలిపారు. పన్ను చెల్లిస్తేగానీ పెన్షన్ ఇచ్చేది లేదని బెదిరించడం ఎంత వరకూ సబబని ప్రశ్నించారు. గాజువాక ప్రాంతంలో అపార్టుమెంట్ల వద్ద చెత్తపై యూజర్ ఛార్జీలు చెల్లిస్తేగానీ చెత్త తరలించబోమని నాలుగైదు రోజులపాటు చెత్తను అక్కడే వదిలేస్తున్నారని తెలిపారు. ఇదేగనుక కొనసాగితే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. స్టాండింగ్ కమిటీలో తీసుకునే నిర్ణయాలపై ప్రతిపక్ష పార్టీల ఫ్లోర్ లీడర్లకు కనీసం సమాచారం ఇవ్వడం లేదని మేయర్‌కు ఫిర్యాదు చేశారు. సెలెస్ట్ రెసిడెంట్స్‌కు వ్యతిరేకంగా జివిఎంసి సిటీ ప్లానింగ్ అధికారులు దౌర్జన్యానికి పాల్పడుతున్న దుశ్చర్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు.

IN THE HONOURABLE COURT OF THE V ADDITIONAL JUNIOR CIVIL JUDGE, AT VISAKHAPATNAM

O.S. 159 / 2023

Between : **The Visakhapatnam Cooperative Bank Ltd.,** Akkayyapalem Branch ... Plaintiff

And : **Smt. Meesala Nirmala & 2 others** ... Defendants

NOTICE TO THE DEFENDANT 1

1st Defendant :
Smt. Meesala Nirmala, W/o. Ramakrishna Naidu Meesala, Hindu with the given address residing at D.No. 45-58-12/5, Satya Sai Vihar, Narasimha Nagar, Visakhapatnam-530 024

Please take notice that the Plaintiff Bank filed the above suit against the defendants to declare that Sale Deed Dt. 26-02-2015 executed by the 1st Defendant in favour of 2nd Defendant before the Defendant No. 3 as illegal, null and void and not binding the Plaintiff Bank and other incidental reliefs etc. In this regard, the Hon'ble Court was pleased to order notice to you through this publication notice by way of substituted service; the 1st Defendant was requested to attend before the Hon'ble Court at 10.30 a.m on 20-09-2023 either in person or through an Advocate with all your defenses and documents, failing which the matter will be decided exparte.

Sd/- By the order of the Court
D.K.V.V.S. ASHWANI KUMAR
ADVOCATE
Opp. to District Court, Visakhapatnam
Cell : 90 32 03 39 45

Visakhapatnam
Date : 25-07-2023

మహారాజశ్రీ యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No. 317/2017 in O.S.No. 55/2016

పిటీషనర్లు / వాదులు:
శ్రీవతి కురుమళ్ళ వెంకట సత్యవతి వగైరాలు

రెస్పాండెంట్లు / వాదులు:
కురుమళ్ళ వెంకట నాగేంద్ర వగైరాలు

నోటీసు

టు:
ఆర్-12: తుటుపల్లి అప్పారావు, తండ్రి సీతారామయ్య, సాయియశోధ అపార్టుమెంట్, ఇంటి నెం. 39-20-40/6, ప్లాట్‌నెం. 7, మాధవధార, విశాఖపట్నము.

పై నెంబరు పిటీషనులో అనగా **I.A.317/2017 in O.S.55/2016**లో మీకు నోటీసులు ఎన్నిసార్లు కోర్టు నుంచి, రిజిష్టర్డు పోస్టు ద్వారా పంపినను బుద్ధిపూర్వకముగా మీరు తీసుకోనందున మీరు తప్పించుకొనుచున్నందున కోర్టు వారు ఇచ్చిన ఆర్డరు ప్రకారము మీరు **తే:27-7-2023ది ఉదయం 10-30 గంటలకు** పైపై నెంబరు పిటీషనులో అనగా **I.A.317/2017 in O.S.55/2016**లో ఈ నోటీసులో పేర్కొన బడిన కోర్టులో మీరు గాని లేక మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరుఅయి మీకు గల వాదనలు మరియు ఆక్షేపణలు తెలియపరచు కొనవలెను. లేని యెడల కోర్టు వారు పై నెంబరు పిటీషను మీ పరోక్షమందు విచారించి తీర్మానించ డమగునని ఈ నోటీసు మూలకముగా తెలియపరచ డమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
జె.వి.యన్.అప్పారావు (వంశి)
పిటీషనర్లు / వాదుల తరపు న్యాయవాది
యలమంచిలి
సెల్: 9490236785

యలమంచిలి
తే: 24-7-23

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

సిపి త్రివిక్రమ్‌వర్మ

ప్రజాశక్తి- పిఎం.పాలెం : మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల జీవితాలు నాశనం కావడమే కాకుండా వారి కుటుంబ సభ్యులను తీవ్ర మనవేదనకు గురి చేసినవారవుతారని విశాఖ పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ అన్నారు. పిఎం.పాలెం వి.కన్వెన్షన్ సెంటర్‌లో విశాఖ సిటీ పోలీసుల ఆధ్వర్యాన డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. మత్తు పదార్థాలను కొన్నా, అమ్మినా సెక్షన్ 20 ప్రకారం రూ.10వేల జరిమానా పడుతుందన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ ఉన్న సమాచారం తెలిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు లేదా డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రచారం చేస్తున్న పోస్టర్లలో ఉన్న ఫోన్ నంబర్‌కు తెలియజేయాలని సూచించారు.

డిసిపి-1 విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ, గంజాయి పట్టుకున్న ప్రతి సందర్భంలోనూ లోతుగా పరిశీలిస్తే వాటి వినియోగంలో ఎక్కువగా విద్యార్థులే ఉన్నారని తెలిపారు. ఒక కేసులో ముగ్గురిని పట్టుకుని విచారిస్తే పెద్ద పెద్ద కళాశాలల్లో చదువుకునే 60మంది వివరాలు లభించాయని చెప్పారు. గంజాయి మత్తుకు అమ్మాయిలు కూడా బానిసలుగా మారుతున్నారని తెలిపారు. మత్తుకు అలవాటు పడి జీవితాలు పాడు చేసుకోవద్దని హితవుపలికారు. ఆంధ్రా యూనివర్సిటీ సైకాలజీ విభాగాధిపతి, సీనియర్ ప్రొఫెసర్ ఎంవి.రాజు మాట్లాడుతూ, విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేక మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, దానిని అధిగమించేందుకు అనేక మార్గాలు ఉన్నాయని తెలిపారు. గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ సర్టిఫైడ్ ఎడిక్షన్ కౌన్సిలర్, గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ చైర్మన్ ఉమారాజ్, మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ కెవి.రామిరెడ్డి మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సిపి త్రివిక్రమ్‌వర్మ

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి

ప్రజాశక్తి -గాజువాక : విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి చెందిన ఘటన శ్రీనగర్‌లో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... స్పెన్సర్ సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో పాపయ్య (45) నిర్మాణ పనులు చేస్తున్నారు. ఆ సమయంలో విద్యుత్ తీగలు తగలడంతో కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయమై మృతిచెందాడు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా యానాం మద్యం పట్టివేత

ప్రజాశక్తి-ఎస్ రాయవరం : మండల కేంద్రమైన రాయవరంలో 18 కేసుల అంతర రాష్ట్ర మద్యాన్ని పట్టుకున్నట్లు నక్కపల్లి సిఐ అప్పన్నబాబు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఎస్ రాయవరం వెంకటేశ్వర స్వామి గుడి దగ్గరలో ఉన్న ఒక్క షెడ్‌లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచి, వేర్వేరు గ్రామాలకు తరలిస్తున్నారని పక్కాగా అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారన్నారు. అక్కడ అనుమానస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను ప్రశ్నించేలోగా పారిపోయేందుకు యత్నించగా పట్టుకుని ఆరా తీశామన్నారు. ఈసందర్భంగా యానాం నుంచి తెచ్చిన 18 బాక్సుల మద్యం బాటిళ్ళను స్వాధీనం పరుచుకున్నట్లు సిఐ అప్పన్నబాబు తెలిపారు. కేసు నమోదు చేసి ఇరువురిని అరెస్టు చేశామని ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

మాట్లాడుతున్న అపోలో వైద్యులు

అపోలోలో 'కవాట' మార్పిడి చికిత్స

ప్రజాశక్తి - ఆరిలోవ : గుండె ఎడమ కవాటం మూసుకుపోయి, శరీరంలో కాలేయం, మూత్రపిండాలు కూడా పాక్షికంగా దెబ్బతిని ప్రాణాపాయ స్థితిలో ఉన్న వృద్ధునికి అపోలో ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించి ప్రాణాలను కాపాడినట్లు యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. ఆరిలోవలోని అపోలో ఆసుపత్రిలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించిన వివరాలు వారి మాటల్లోనే.... 'శ్రీకాకుళం జిల్లాకు చెందిన బానూజీరావు (78) గుండె ఎడమ కవాటం మూసుకుపోవడంతో రక్తప్రసరణ సరిగా జరగక ఊపిరితిత్తులు, శరీర ఇతర భాగాల్లో నీరు చేరుకుంది. అపోలో కార్డియాలజీ విభాగం వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి రోగికి ఎడమకవాటం మార్పిడి అవసరమని గుర్తించారు. హృద్రోగ సమస్యతో పాటు, ఇతర అవయవాలు కూడా పాక్షికంగా దెబ్బతిని ఉండడంతో ఓపెన్ హార్ట్ సర్జరీకి వీలుపడదని నిర్ధారించారు. కుడి తొడ భాగం నుండి చిన్న రంధ్రం చేసి గుండెలో 27.5 ఎంఎం కవాటం (ట్రాన్స్ కెథటర్ మైట్రల్ వాల్వ్ రిప్లేస్‌మెంట్ ప్రక్రియను చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బానూజీరావు వారం రోజుల్లోనే కోలుకున్నారు. అపోలో కార్డియాలజీ బృందం డాక్టర్ చక్రధర్ పెడాడ, డాక్టర్ బికె.బారువ, డాక్టర్ ఎన్‌కె.పాణిగ్రహి, డాక్టర్ శశాంక్, డాక్టర్ రవికాంత్, డాక్టర్ జైదీప్‌కుమార్ త్రివేది ఈ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు' అని వివరించారు.

కుసులువాడలో నేత్ర వైద్యశిబిరం

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని కుసులవాడలో శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, విశాఖ ఐ ఆస్పత్రి సహకారంతో ఏర్పాటుచేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి ప్రారంభించారు. 60 మందిని పరీక్షించారు. ఐ డ్రాప్స్‌ను అందించారు. ఐదుగురికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి విశాఖ ఐ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ, శ్రీ సత్యసాయి సేవా సంస్థల సేవలు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల విశాఖ జిల్లా కో-ఆర్డినేటర్ మానాపురం సత్యసాయి కుమార్, శివాజీ, వత్సవాయి కృష్ణమూర్తిరాజు, ఆర్ఎ.నాయుడు, సాయికుమార్, డబ్బీరు విజయ్ కుమార్, కోరాడ తమ్మునాయుడు, డిపి.రాజు, డి.శరత్‌కుమార్, డివి.సంతోష్‌కిరణ్, ఎస్‌బ్రమణ్యం పాల్గొన్నారు.

ఆసరా వితరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : దీన్‌దయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహానికి విశాఖపట్నం ఆసరా ఛారిటబుల్ సొసైటీ ఆసరాగా నిలిచింది. రూ.44 వేలు విలువైన కాయగూరలు నిల్వ ఉంచుకునే ఫ్రీజర్, వెట్ గ్రైండర్, ఇడ్లీ పాత్రలను వితరణగా అందజేశారు. ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహంలో మంగళవారం ఆసరా ఛారిటబుల్ సొసైటీ ప్రెసిడెంట్ సిహెచ్.సునీత, సభ్యులు బి.శ్రీనాథ్, జెజెబి మెంబర్ పి.సూర్యభాస్కరరావు కలిసి గృహం పర్యవేక్షణాధికారి వీరయ్యకు వస్తువులను అందజేశారు.

సాల్ట్‌పై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక దొరతోటలోని ప్రయివేట్ స్కూల్‌లో సమగ్ర శిక్ష ఆధ్వర్యాన విశాఖ జిల్లా వేదికగా సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) రెండో విడత శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 29వ తేదీ వరకు జరగనున్న తరగతులను పాఠశాల విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఎం.జ్యోతికుమారి ప్రారంభించారు. శిక్షణా తరగతుల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త ఎస్.బాబూరావు, ప్రోగ్రాం మేనేజర్ సత్య కైవల్య, రాష్ట్ర పరిశీలకులు ఎస్.కల్పన, డిప్యూటీ డిప్యూటీ డిఇఒ ఎ.గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నారు మడుల పరిశీలన

పంట పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల పరిధిలో నారు మడులను అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు ఎం.విశాలాక్షి, ఎ.శిరీష, విశాఖపట్నం జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్.సుబ్రమణ్యం, భీమిలి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.విజయ్‌ప్రసాద్, మండల వ్యవసాయాధికారి సిహెచ్.సంధ్య రత్నప్రభ మంగళవారం పరిశీలించారు. ఆనందపురం మండలం బోని గ్రామంలో పొలంబడి వరి నారుమడులను పరిశీలించి, ఆకు ఎండు తెగులును గుర్తించారు. నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రాములు 10 లీటర్ల నీటిలో, స్ట్రెప్టోసైక్లిన్ ఒక గ్రాము పది లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి అని తెలిపారు. పద్మనాభం మండలం పాండ్రంగిలో మిషన్‌తో వేసిన వరి నారు మడులను సందర్శించారు, ప్రధాన పొలంలో ఏకరానికి డిఎపి ఒక బస్తా లేదా సూపర్ రెండు బస్తాలు, యూరియా అర బస్తా, పొటాష్ అర బస్తా దమ్ములో వేయాలని సూచించారు. జింక్ లోపాన్ని సవరించడం కోసం ఎకరానికి 20 కేజీలు జింక్ సల్ఫేట్‌ను మిగిలిన ఎరువులతో కాకుండా రెండు రోజులు ముందుగా వేసుకోవాలని తెలిపారు. భీమిలి మండలం మజ్జివలస గ్రామంలో వేరుశనగ పొలాలను సందర్శించి అధిక దిగుబడుల కోసం రైతులకు పలు సూచనలు చేశారు. పూత దశలో జిప్సం వాడాలని తెలిపారు. ఇమాజిత్‌పైర్ ఎకరానికి 300 ఎంఎల్ పిచికారి చేయడం ద్వారా వేరుశనగ పంటలో కలుపు నివారించవచ్చని చెప్పారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి -పిఎం పాలెం : రోటరీ క్లబ్, వైజాగ్ డిమాండ్స్‌ఆధ్వర్యాన జివిఎంసి 6వ వార్డు పరిధి కె2 కాలనీలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. సుమారుగా 100 మందికి వైద్యసేవలందించి, మందులు పంపిణీ చేశారు. పిల్లలు, స్త్రీ వైద్య నిపుణులు కెవి.రాజారమేష్, మౌనిక వైద్య తనిఖీలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు శశిజైశ్వాల్ మాట్లాడుతూ, పేదలకు సంస్థ ద్వారా వైద్య సేవలే కాకుండా, విపత్తుల కాలంలోనూ సహాయం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు జి.రాంబాబు, ఎస్.కామేశ్వరరావు, కె.నగేష్‌కుమార్, విశాల్‌ప్రసాద్, విసిసి కార్యకర్తలు డి.కొండమ్మ, డి.శైలు, సిఐటియు నాయకులు నాయకులు పి.రాజుకుమార్, కె.వెంకటప్పారావు, ఎస్.అప్పలరాజు, పద్మ, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలనపై సమీక్ష

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరరెడ్డి

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : ఇంటింటా ఓటరు జాబితా పరిశీలనపై స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళ వారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు ఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణలను అధికారులు సమావేశంలో వివరించారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, ఎలక్షన్ డిటి భాస్కరరావు, రాజకీయ పార్టీల నుంచి అల్లిపిల్లి నరసింగరావు (వైసిపి), గంటా నూకరాజు (టిడిపి), కె.రామానాయుడు (బిజెపి), ఇఎన్ఎస్.చంద్రరావు (జనసేన) పాల్గొన్నారు

పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి పిఎం.పాలెం సమీపంలోని ఆర్‌హెచ్.కాలనీలో బిఎల్‌ఒతో కలిసి టిడిపి, జనసేన నాయకులు ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా 259 ఓటర్ల బూత్ ఓటర్ల జాబితా వెరిఫికేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు టిడిపి అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, జనసేన నాయకులు ఇఎన్ఎస్ చంద్రరావు, కెవిఆర్ కేటరింగ్ అధినేత గరే గురునాథ్, రెడ్డి సత్యనారాయణ, పెంటపల్లి బబ్బెలు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి దినపత్రిక
ఉద్యోగ అవకాశాలు
విశాఖపట్నం కేంద్రంలో మార్కెటింగ్ విభాగాల్లో పని చేయుటకు ఉద్యోగాలు ఉన్నాయి
ఆసక్తిగలవారు మా కార్యాలయానికి వచ్చి సంప్రదించగలరు.
1. గాజువాక డివిజన్ కో-ఆర్డినేటర్ (మార్కెటింగ్)
2. జాబ్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ (ప్రింటింగ్ వర్క్)
3. హెల్పర్స్ (ప్రింటింగ్ సెక్షన్)
- మొదటి ఉద్యోగానికి ఇతర పత్రికలలో మార్కెటింగ్‌లో అనుభవం ఉండాలి. టీంని లీడ్ చేసే సామర్థ్యం ఉండాలి
- 2వ ఉద్యోగానికి ప్రింటింగ్ వర్క్ ఆర్డర్లు బుక్ చేసే అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
- 3వ ఉద్యోగానికి 10వ తరగతి/ఐ.టి.ఐ లేదా ప్రింటింగ్ సెక్షన్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 9490099125, 9490099133
ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం : ప్లాట్ నెం.3, 'జి' బ్లాక్, ఇండస్ట్రియల్ పార్క్, వడ్లపూడి, ఆటోనగర్, విశాఖపట్నం-46

గంగవరం సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షులు కొవిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. అదాని గంగవరం పోర్టు యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా నిర్వాసిత కార్మికులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు మంగళవారం నాటికి 22వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కొవిరి అప్పలరాజు మాట్లాడుతూ, కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లపై యాజమాన్యంతో పలుదఫాలు సంప్రదింపులు జరిపినప్పటికీ మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గంగవరం పోర్టులో షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ కింద మరో బోగస్ కంపెనీని యాజమాన్యం రిజిస్ట్రేషన్ చేయించుకుని జిపిఎఫ్ పేరుతో కార్మికుల శ్రమను దోచుకుంటోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకొని సంప్రదింపులు ద్వారా కార్మికుల వేతనాలు పెరిగేలా కృషి చేయాలని కోరారు. 52 మంది కార్మికుల బృందం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలిసేందుకు విజయవాడ వెళ్లారని, వారికి అపాయింట్‌మెంట్ ఇచ్చి కార్మికుల గోడు వినాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాసుపిల్లి యల్లాజీ, కొవిరి అమ్మోరు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న గంగవరం పోర్టు కార్మికులు

నూతన వేతనాల అమలుకు సంతకాల సేకరణ

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ కార్మికులకు సెయిల్ మాదిరిగా వేతనాలు అమలుచేయాలని కోరుతూ ఎస్ఎంఎస్-2లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) విభాగ కార్యదర్శి యు.మరిడయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రాంబాబు, అశోక్‌కుమార్, మొల్లి సునీల్ మాట్లాడుతూ, 2021న ఎన్‌జెసిఎస్‌లో వేతన ఒప్పందం జరిగిందన్నారు. దీని ప్రకారం సెయిల్ కార్మికులకు నూతన వేతనాలు అమలైనా, విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నేటికీ అమలుచేయలేదని తెలిపారు. నూతన వేతనాలు చెల్లించేందుకు 2022 ఫిబ్రవరిలో బోర్డు ఆమోదించిందని, 2022 మే నెలలో ఉక్కు శాఖ మంత్రి అనుమతి కోసం పంపించినప్పటికీ ఇప్పటికీ స్పందన లేదన్నారు. కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తక్షణమే నూతన వేతనాలు చెల్లించేందుకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

మహిళలు కలలను నిజం చేసుకోవాలి

ప్రజాశక్తి -ములగాడ : ప్రతి మహిళ తన ఉజ్వల భవిష్యత్తుకు కలలు కని, వాటిని సాకారం చేసుకునేందుకు కృషిచేయాలని రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి సూచించారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో మంగళవారం జరిగిన నూతన విద్యార్థినుల స్వాగత సమావేశంలో ఆమె ప్రసంగించారు. మహిళల అభివృద్ధికి విద్య ఎంతో ముఖ్యమన్నారు. విద్య వల్ల ధైర్యం, తెలివితేటలు, మాట్లాడే శక్తి, పోరాటపటిమ వస్తాయని, ఇవి మహిళా సాధికారతలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జానీస్, సిస్టర్ జయశీల పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానాలు

ప్రజాశక్తి- కరాస : తాగి వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కంచరపాలెం పోలీసులకు పట్టుబడ్డ 18 మంది మందుబాబులకు మూడవ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, ఇన్‌ఛార్జి 5వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ వై.గణపతిరావు జరిమానాలు విధించారు. తాగి కారు, లారీ నడిపిన వారికి రూ.10 వేలు, వాహనానికి పొల్యూషన్ సర్టిఫికెట్ లేనందుకు రూ.1,000, డ్రైవింగ్ లైసెన్స్ లేనందుకు రూ.6 వేలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి వాహనం ఇచ్చిన వాహన యజమానికి రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.1,31,000 జరిమానా విధించినట్లు కంచరపాలెం ట్రాఫిక్ సిఐ మళ్ల అప్పారావు తెలిపారు.

కోలా గురువులును కలిసిన గాజువాక నాయకులు

ప్రజాశక్తి -గాజువాక : వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కోలా గురువులును పార్టీ గాజువాక నియోజకవర్గ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కోలా గురువులును సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, గొందేశీ శ్రీనివాస్‌రెడ్డి, గంగుతూరి రోజారాణి, ములకలపల్లి వెంకటేష్, మెడికల్ బాబు పాల్గొన్నారు.

'సకల కళాకారుల' నామినేషన్ల స్వీకరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘానికి ఈ నెల 30వ తేదీన నిర్వహించే సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలకు సంబంధించి విశాఖ పౌరగ్రంథాయలంలో మంగళవారం నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్షులుగా రచయిత్రిలు డాక్టర్ జాలాది విజయ, చెక్కా రమాదేవి, ఉపాధ్యక్షులుగా ఎం.త్రినాథరావు, పి.ఎ.భాస్కరరావు, కార్యదర్శిగా కె.లోకేష్, సహాయ కార్యదర్శిగా గెంబలి జగదీష్, కోశాధికారిగా మధుపాడ రమణి, బూడిద లక్ష్మీస్వరూప నామినేషన్లు అందజేశారు. ఎన్నికల అధికారులుగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, గాయకులు జామి శివ అప్పలరాజు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్ చెన్నా తిరుమలరావు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నేరం

ప్రజాశక్తి -తగరపువలస : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నేరమని భీమిలి సిఐ డి రమేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానికంగా ఉన్న పలు మద్యం దుకాణాల వద్ద పోలీసుల ఆధ్వర్యాన మంగళవారం బోర్డులు ఏర్పాటుచేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మంగళవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరి కొన్నింటికి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఉక్కు పరిరక్షణకు ఆమ్ ఆద్మీ చలో ఢిల్లీ

సంఘీభావ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అయోధ్యరామ్, ఆమ్‌ఆద్మీ నాయకులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ రిలే నిరాహార దీక్షలు 900 రోజులకు సమీపిస్తున్న సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు సంఘీభావంగా చలో ఢిల్లీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యులను స్టీల్‌ప్లాంట్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గతంలోనూ ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ నేతలకు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ తరపున వినతి పత్రాన్ని సమర్పించామని అయోధ్యరామ్ తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ తరపున పార్లమెంట్లో ప్రశ్నించారని చెప్పారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీకి అండగా నిలబడి సంఘీభావంగా చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషించదగ్గ విషయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు పోరాటానికి సంఘీభావం తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు ఎస్.పవన్, సీర రమేష్, కెఎం.రాజు, శీతల్ మదన్ పాల్గొన్నారు.

50వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-మాధవధార : జివిఎంసి 50వ వార్డు పరిధి మహత్‌కాలనీ, వంశీనగర్‌లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ కలిసి ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు పప్పల సునీత, పైడి శ్రీను, ప్రసన్నరెడ్డి, ఆళ్ల శివగణేష్, అమర్‌రెడ్డి, భగాతి విజయ్, పైడి కృష్ణారావు, సనపల నారాయణస్వామి, ఎవిఎన్.రాజు, సబ్బవరపు శ్రీను, పొన్నాడ అప్పారావు, ఎం.లక్ష్మి, పాతపట్నం రామ్మోహన్, రాంబాబు, శివరాం, త్రినాథ్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలబ్రోచర్‌ను అందిస్తున్న కెకె.రాజు

భారతీయ కళలు విశిష్టమైనవి : రెక్టార్ సమత

ప్రజాశక్తి-విశాఖపట్నం : భారతీయ సంప్రదాయ కళలు ఎంతో విశిష్టమైనవని ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. మంగళవారం ఉదయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో నిర్వహించిన ప్రవాస భారతీయులు చెళ్లపిళ్ల శ్రావణి శాస్త్రీయ నృత్య ప్రదర్శన అనంతరం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ, కళలపై ఉన్న మక్కువతో విదేశాల్లో ఉన్నప్పటికీ ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి కూచిపూడి నృత్యాన్ని అభ్యసించి, ప్రదర్శించడం గర్వకారణమన్నారు. బాల్యం నుంచి చిన్నారుల్లో ఉన్న ఆసక్తులను గుర్తించి వారిని తదనుగుణంగా తీర్చిదిద్దడం తల్లిదండ్రుల బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నృత్య కళాకారిణి శ్రావణిని, ఆమె తల్లిదండ్రులను అభినందించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ, వ్యక్తి సమగ్రాభివృద్ధికి, వికాసానికి కళలు దోహదపడతాయన్నారు. ఎంతో ఏకాగ్రత కలిగి ఉంటేనే ఇటువంటి సంప్రదాయ కళలను అభ్యసించడం సాధ్యపడుతుందని చెప్పారు.

ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ, భారతీయ కళల ప్రాభవాన్ని, ప్రత్యేకతను చాటి చెప్పే విధంగా శ్రావణి నృత్య ప్రదర్శన జరిగిందన్నారు. కార్యక్రమంలో సంగీత నృత్య విభాగాధిపతి ఆచార్య ఎ.అనురాధ, ఆచార్య సరస్వతి, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న శ్రావణి

ర్యాగింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-లీగల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన ఆంధ్ర వైద్య కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్ చట్టంపై అవగాహన కల్పించారు. డిఎల్ఎస్ఎ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంవి.శేషమ్మ మాట్లాడుతూ, ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం శిక్షార్హులని, అటువంటి ఘటనకు పాల్పడి తమ బంగారు భవిష్యత్తులను నాశనం చేసుకోవద్దని వైద్య విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రవీంద్ర కిషోర్, ఎం.హేమారాధిక, టి.సురేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాలకు భూమిపూజ

ప్రజాశక్తి-సీతమ్మధార :కొత్త జాలారిపేట, పెయిందోర పేటలో పోలమాంబ, భూలోకమాంబ, కొత్తమాంబ అమ్మవార్ల నూతన దేవాలయ నిర్మాణాలకు దక్షిణ నియోజకవర్గ వైసిపి నాయకులు సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యాన భూమిపూజ నిర్వహించారు. మత్స్య పారిశ్రామికుల సంక్షేమ సంఘం సభ్యుల ఆహ్వానం మేరకు సీతంరాజు సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కుల పెద్ద నోళ్ల మురళీకృష్ణ, పూజారి చింతపల్లి జంబుబాబు, సంఘం గౌరవాధ్యక్షులు వాడమోదుల పెంటయ్య, సెక్రటరీ చింతపల్లి అయ్యప్పరాజు, గుండ్లు సూకరాజు, ఒలిశెట్టి కొరలయ్య, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -గాజువాక : కూర్మన్నపాలెం దళిత కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన దువ్వాడ వంతెన కింద డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అన్నారు. కులతత్వాన్ని రూపుమాపాలని, సాంఘిక అసమానతలపై అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైసిపి అదనపు కార్యదర్శి సుబ్బారావు, డాక్టర్ మామిడి సుదర్శన్, గాలి ఆనంద్, బలిరెడ్డి నాగేశ్వరరావు, బలిరెడ్డి పెంటారావు, బత్తిన సత్తిబాబు, వెలుగుల పరశురామ్, సీతమహలక్ష్మి, బొడ్డు కల్యాణరావు, జెవి.ప్రభాకర్, పాలేటి పెంటారావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు జలమయం

ప్రజాశక్తి -గాజువాక : కురుస్తున్న వర్షానికి గాజువాకలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. 100 అడుగుల రోడ్డు పూర్తిగా నీటితో మునిగిపోయింది. శ్రీనగర్ జాతీయ రహదారిలో నీరు ఎక్కువగా చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. నీరు ఎక్కువగా ఉండటంతో ద్విచక్ర వాహనదారులు స్పెన్సర్ రోడ్డు, సర్వీస్ రోడ్డు నుండి రైల్వే ట్రాక్ మీదుగా వడ్లపూడి చేరుకుంటున్నారు. అన్ని ప్రధాన కూడళ్లు వద్ద వర్షపు నీరు చేరింది.

గిట్టుబాటు ధరకు మరో ఉద్యమం

ఏపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముర్రావు సూర్య నారాయణ

ప్రజాశక్తి- మునగపాక రూరల్

గిట్టుబాటు ధర కోసం మరో రైతు ఉద్యమానికి సిద్ధం కావాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముర్రావు సూర్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక సహకార సంఘం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సంయుక్త కిసాన్ మోర్చా, రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో జిల్లా రైతు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 నెలల పాటు ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమానికి దిగొచ్చిన మోడీ సర్కార్ దొడ్డిదారిన రైతు వ్యతిరేక చట్టాలను అమలు పరిచే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అంబానీ, అదాని వంటి కార్పొరేట్ సంస్థలు మోడీ విధానాల వల్ల లక్షల కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నాయని తెలిపారు. ఢిల్లీ తరహాలో ఆంధ్రాలో కూడా హక్కుల సాధనకై రైతు ఉద్యమాన్ని నడపాలన్నారు. అఖిలపక్ష రైతు సంఘాల జిల్లా కో కన్వీనర్ ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ రైతులకు బ్యాంకులో రుణాలు ఇవ్వకపోవడంతో ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు తీసుకుని, వడ్డీలు కట్టలేక, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాడి రైతుల నుండి లీటరు పాలను రూ.40కు కొనుగోలు చేసే పాల డెయిరీలు వివిధ రూపాలలో రూ.200 ఆర్జిస్తున్నాయని చెప్పారు. పాడి రైతులకు లీటరుకు కనీసం రూ.70 చెల్లించాలని, బెల్లం రైతులకు కేజీ రూ.60 గిట్టుబాటు ధర అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో ఆరున్నర లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రైతాంగ సమస్యల పరిష్కారానికై ఈ నెల 30న విజయవాడలో జరిగే రాష్ట్ర రైతు సదస్సుకు రైతులు తరలిరావాలని, ఆగస్టు నెల 9న క్విట్ కార్పొరేట్ ఉద్యమానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రైతు, కార్మిక సంఘాల నాయకులు జి.నాయన బాబు, ఆర్.శంకర్రావు, వివి శ్రీనివాసరావు, ఎస్ బ్రహ్మాజీ, బాలు గాడి, ఎఎన్‌వి మహేష్, రెడ్డిపల్లి అప్పలరాజు, గణేష్, కాంగ్రేగుల సదాశివరావు, ఎస్ కన్నుమనాయుడు, ఆళ్ల మహేశ్వరరావు, టెక్కలి జగ్గారావు, కె.రాము, శరగడం రామనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీ సత్యవతి

ఎన్‌టిఆర్ ఆసుపత్రి క్రిటికల్ కేర్ బ్లాక్‌కు రూ.22.15 కోట్లు మంజూరు

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లిలోని ఎన్‌టిఆర్ జిల్లా హాస్పిటల్ ఆవరణలో నూతనంగా పీఎం- ఏబిహెచ్ఐఎం స్కీమ్ ద్వారా రూ.22.15 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిధులు మంజూరు చేసినట్లు అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి తెలిపారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి సుఖ్ మాండవీయని మంగళవారం ఆమె కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందించి ధన్య వాదాలు తెలిపారు. ఆంధ్ర రాష్ట్రానికి 11 క్రిటికల్ కేర్ బ్లాక్స్ మంజూరు కాగా, అందులో ఎన్టీఆర్ ఆసుపత్రి కూడా ఉందని పేర్కొన్నారు. ఈసిసిబి నిర్మాణం ద్వారా అత్యవసర వైద్య సేవలు అనకాపల్లి జిల్లా హాస్పిటల్‌లోనే అందుబాటు లోనికి వస్తాయని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి- కె.కోటపాడు

బంగారి వెంకటేశ్వరరావు

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బంగారి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లపై ప్రభుత్వం మధ్య స్థాయి అధికారులతో కూడిన కమిటీ వేసి విరుద్ధంగా వెళ్లాలని చూస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగులకు రిజర్వేషన్లను దాదాపుగా రద్దు చేసే విధంగా అధికారుల కమిటీ నివేదిక ఇచ్చిందన్నారు. ఈ విషయమై ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాసంఘాల ఐకాస ఇటీవల విజయవాడలో సమావేశమై ఆందోళన వ్యక్తం చేశామని పేర్కొన్నారు. ఈనెల 25 నుండి జిల్లాల్లో ధర్నాలు, ర్యాలీలు నిర్వహించి కలెక్టర్లకు వినతి పత్రాలు అందిస్తామన్నారు. ప్రభుత్వం వెంటనే సంఘం నేతలతో చర్చించి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రిజర్వేషన్లకు సంబంధించిన జీవో 5, 26 ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర తదితరులు

పంట సేకరణ కేంద్రాలు, శీతల గిడ్డంగుల నిర్మాణానికి రూ.7.27 కోట్లు మంజూరు

జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో 36 పంట సేకరణ కేంద్రాలు, 15 శీతల గిడ్డంగుల నిర్మాణానికి రూ.7 కోట్ల 27 లక్షల 50 వేలు మంజూరైనట్లు కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి తెలిపారు. అలాగే 3 కోట్ల 20 లక్షల రూపాయలతో ఇప్పటివరకు 18 ఉద్యాన పంట సేకరణ కేంద్రాలు, 4 శీతల గిడ్డంగులు నిర్మించినట్లు వెల్లడించారు. మంగళవారం ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రాలు, శీతల గిడ్డంగులను రైతులకు అంకితం చేసే కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రితో ఆయన మాట్లాడారు. పంట సేకరణ కేంద్రాల ద్వారా పండ్లు, కూరగాయలు ఇతర ఉత్పత్తులను శుభ్రపరిచి నిల్వ చేసుకునే సౌకర్యం కలిగిందన్నారు. రైతుల ఉత్పత్తులను భద్రపరచుకునేందుకు శీతల గిడ్డంగులు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ వీటి ద్వారా చోడవరం, పెందుర్తి నియోజకవర్గాల రైతులకు మద్దతు ధరకు మించి అమ్ముకునేందుకు అవకాశం వచ్చిందన్నారు. చోడవరంలో కూడా కోల్డ్ స్టోరేజీలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే ఎ.అదీప్ రాజు, జెడ్పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర, వైస్ ఛైర్‌పర్సన్ బి వరాహ సత్యవతి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్ రావు, అమృత ఫల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఛైర్మన్ అప్పలనాయుడు, సీఈవో కె.మౌక్తిక తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డైట్ లెక్చరర్ మహాలక్ష్మి

విద్యార్థుల అభ్యాసనపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-కె.కోటపాడు

విద్యార్థులలో మెరుగైన అభ్యాసనపై ప్రత్యేక దృష్టి సారించి, మంచి ఫలితాలు సాధించాలని భీమిలి డైట్ లెక్చరర్ మహాలక్ష్మి ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ఏ కోడూరు హైస్కూల్లో బయోలాజికల్ సైన్స్ సబ్జెక్టు స్థాయి కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్నారు. 9వ తరగతి విద్యార్థులు తప్పనిసరిగా ట్యాబ్స్ ద్వారా బైజూస్ కంటెంట్‌లను వినియోగించాలన్నారు. దీని ద్వారా విద్యార్థులలో మెరుగైన ఫలితాలు రాబట్టు వచ్చని చెప్పారు. విద్యార్థుల వర్క్ బుక్, నోట్ బుక్ కరెక్షన్ తప్పనిసరిగా సరి చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి జీవీకే కిట్లు పాఠ్యపుస్తకాలు అందించాలన్నారు. స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పిల ద్వారా డిజిటల్ టెక్నాలజీ వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కె సత్యనారాయణ, డివిడి ప్రసాద్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు కామేశ్వరరావు, సిఆర్‌పి ఆర్‌పి నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాలు భేష్

ప్రజాశక్తి-అనకాపల్లి

గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ కార్యక్రమాల నిర్వహణ చాలా బాగుందని కేంద్ర స్వచ్ఛభారత్ మిషన్ ఐఇసి కన్సల్టెంట్ సాక్షి శ్రీవాత్సవ అన్నారు. మంగళవారం జిల్లాలోని పరవాడ మండలం వెన్నెల పాలెం, మునగపాక మండలం మునగపాక పంచాయతీ, అనకాపల్లి మండలం మార్టూరు గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను సందర్శించి గ్రామంలో సేకరించిన తడి చెత్త, పొడి చెత్తను ఉపయోగించి వర్మీ కంపోస్ట్ తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన ఎస్ ఎస్ జి బోర్డులను, నినాదాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి శిరీష రాణి, డీపీఆర్‌సి కో- ఆర్డినేటర్ నాగలక్ష్మి, రూరల్ వాటర్ సప్లై అధికారులు, ఈఓఆర్‌డిలు, పంచాయితీ కార్యదర్శులు, స్వచ్ఛభారత్ కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మిడ్డే మీల్స్ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ ఎపి మధ్యాహ్నం భోజనం పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యాన మంగళవారం ఎంఇఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎ.వరలక్ష్మి, వి ఉమ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో భాగంగా భోజన పథకం కార్మికులకు వేతనాలను పెంచుతామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు కావస్తున్న అమలు చేయలేదని ఆరోపించారు. కనీస వేతనాన్ని 10 వేల రూపాయలకు పెంచాలని, ప్రతి నెల 5వ తేదీ నాటికి చెల్లించాలని, గుర్తింపు కార్డులు, యూనిఫామ్‌ను అందజేయాలని, వంట పాత్రలు, గ్యాస్ ప్రభుత్వం సరఫరా చేయాలని, కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని, పెరుగుతున్న నిత్యావసర ధరల అనుగుణంగా విద్యార్థులకు ఒక్కొక్కరికి 20 రూపాయలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 31న నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రవణమ్మ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న మిడ్డేమీల్స్ కార్మికులు

కనువిందు చేసిన హరివిల్లు

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం చిరుజల్లులు పడ్డాయి. ఈ సమయంలో ఆకాశంలో రంగురంగుల హరివిల్లు కనివిందు చేసింది. దానిని చూసిన చిన్నారులు పులకరించారు. మంగళవారం కురిసిన వర్షం వ్యవసాయ పనులకు ఉపయోగకరంగా ఉంటుందని, ఖరీఫ్ సాగుకు అవసరమైన నీరు చెరువులో నిల్వ ఉండే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

ఆకాశంలో కనువిందు చేస్తున్న హరివిల్లు

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

బోదువలసలో గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని బోదువలస గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ మంగళవారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, జెడ్‌పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, మాజీ జెడ్పీటీసీ కోటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కాపుశెట్టి శేషు బాబు, ఎంపిడిఒ రమేష్ నాయుడు, బోదువలస సర్పంచ్ నేబర్తి శ్రీను, కోన సంజీవరావు, సర్పంచ్‌లు ఉగ్గిన నాయుడు, బోను నాయుడు, మోపాడ అప్పారావు, ఎంపిటిసిలు గవర రాజు, మామిడి కొండాజీ, దాసరి లక్ష్మి మధు, నాయకులు ఎడ్ల నాయుడు, యర్ర శ్రీనివాసరావు, బుదిరెడ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

బైజూస్ ట్యాబ్‌ల ద్వారా విద్యా బోధన జరగాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

బైజూస్ ట్యాబుల ద్వారా విద్యా బోధన జరగాలని, విధిగా వర్క్ బుక్కులు పరిశీలించాలని కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఆదేశించారు. స్థానిక జీవీఎంసీ టౌన్ గర్ల్స్ హైస్కూల్లో మండల విద్యాశాఖ అధికారుల సమీక్షా సమావేశం జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎం వెంకట లక్ష్మమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కలెక్టర్ ముందుగా మున్సిపల్ పట్టణ బాలికల పాఠశాలలో బాలికలతో సంభాషించి, ఐఎఫ్పి టీవీలో విద్యా బోధన పరిశీలించారు. బాలికల అభ్యసనా సామర్ధ్యాలను, వారి వర్క్ పుస్తకాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోను ఉపాధ్యాయులు ఖచ్చితంగా వర్క్ పుస్తకాల సరిదిద్దడం, తరల్, లిప్ పద్ధతులను విధిగా అమలు చేసేలా చూడాలని ఆదేశించారు. విద్యార్థులు బైజూస్ ట్యాబ్లు పాఠశాలకు విధిగా తీసుకొచ్చేలాగ, వాటిద్వారా అభ్యసన చేసేలా ఐఎఫ్‌పి టీవీల్లో పాఠ్యాంశాల బోధన, టోఫెల్ కార్యక్రమాల నిర్వహణ పాఠశాలల్లో జరిగేలా మండల విద్యాశాఖ అధికారులు సమీక్ష చేయాలని సూచించారు. ప్రతి ఎంఇఒ కచ్చితంగా నెలలో 20 పాఠశాలలు సందర్శించాలన్నారు. చైల్డ్ ఇన్ డ్రాప్ బాక్స్‌లో, సిస్టమ్ డ్రాప్ బాక్స్‌లో, స్కూల్ డ్రాప్ బాక్స్‌లో వున్న పిల్లల డేటా క్లియర్ చేయాలని ఆదేశించారు. ట్రాన్సిషన్ గణనీయంగా తగ్గాలని సూచించారు.

నేడు మాజీ ఎమ్మెల్సీ నాగజగదీష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

మాజీ ఎమ్మెల్సీ, టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆ పార్టీ నాయకులు వెల్లడించారు. పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో మంగళవారం జిల్లా కార్యదర్శి బొలిశెట్టి శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక పెంటకోట కన్వెన్షన్ సెంటర్‌లో జన్మదిన వేడుకలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, అనుబంధ సంస్థల నాయకులు, సీనియర్ ఎన్టీఆర్, బాలకృష్ణ ఫ్యాన్స్, పార్టీ సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నడిపల్లి గణేశ్వరరావు, కోట్ని రామకృష్ణ, వేగి వెంకటరావు, మళ్ల గణేష్, దూలం ప్రసాద్, బొడ్డేడ మురళి, డివివి అప్పారావు, మళ్ల శివన్నారాయణ, మామిడి చిన్నారావు, షేక్ రియాజ్, కూండ్రపు కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

పలుచోట్ల విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, 3, 4, 5 తరగతుల విలీన ప్రక్రియను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపుతో మంగళవారం విశాఖ నగరంలోని కొన్ని విద్యాసంస్థలు మూతపడ్డాయి. బంద్ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలన్నారు. జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం యథావిధిగా కొనసాగించాలని, ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని కోరారు. డిగ్రీ నాలుగు సంవత్సరాలు కాకుండా మూడు సంవత్సరాలుగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్, టిఎన్ఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఎన్ఎస్‌యుఐ, ఎఐఎస్ఎ, ఎఐడిఎస్ఒ సంఘాల నాయకులు ఉల్లం నాగరాజు, కె.అచ్యుతరావు, రత్నకాంత్ పాల్గొన్నారు.

అనకాపల్లి : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన అనకాపల్లిలో మంగళవారం విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. దీంతో పలు విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సతీష్,

అనకాపల్లి ఎఎంఎఎల్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బియ్యపు రాజు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, 3, 4, 5 తరగతుల విలీన ప్రక్రియ విరమించుకోవాలని, కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడి అరికట్టాలని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు మిడ్డేమీల్స్ పెట్టాలని, ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని, డిగ్రీలో మేజర్ మైనర్ సబ్జెక్ట్ విధానాన్ని విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు కొండూరి రవీంద్ర, వియ్యపు గణేష్, ఎన్.ఆనంద్, వి.వంశీ, మధు, వెంకటేష్, రవి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రజాభిప్రాయ సేకరణ

వినతిపత్రం ఇస్తున్న ఎ.కొత్తపల్లి గ్రామస్తులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని ఏ.కొత్తపల్లిలో రింగురోడ్డు నిర్మాణం విషయంపై మంగళవారం బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ ప్రశాంతంగా జరిగింది. ఈ గ్రామంలోని అక్కమ్మ చెరువు గట్టుపై నుంచి రింగురోడ్డు నిర్మాణ విషయంలో ఆయకట్టు రైతుల్లో విభేదాలు తలెత్తాయి. చెరువు గట్టుమీద నుంచి సీసీ రోడ్డు నిర్మాణం కోసం గతేడాది జనవరి 2న గ్రామసభ నిర్వహించగా, కొంత మంది ఆయకట్టు రైతులు ఆమోదం తెలపడంతో రోడ్డు నిర్మాణానికి పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. రూ.కోటి 19 లక్షల వ్యయంతో చెరువు గట్టుపైన 200 మీటర్ల సీసీ రోడ్డుతో పాటు కిలో మీటరున్నర తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. చెరువు గట్టు పై నుంచి రోడ్డు వెయ్యడం వల్ల తమ ఆయకట్టు భూములు కోల్పోతామని, నాడు నిర్వహించిన గ్రామసభ లోపభూయిష్టంగా జరిగిందని, ఆ రోడ్డు పనులు వెంటనే నిలుపుదల చేయాలని 14 మంది హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ రోడ్డు పనులు ఆపాలని గత ఏడాది ఏప్రిల్ 17న హైకోర్టు స్టేటస్కో ఆర్డరు ఇవ్వడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఈ రోడ్డు నిర్మాణం విషయంపై మంగళవారం ఎంపిడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి గ్రామసభ నిర్వహించారు. చెరువుగట్టు నుంచి రోడ్డు నిర్మించేందుకు 173 మంది ఆమోదం తెలపగా, 13 మంది వ్యతిరేకించారు. కొంతమంది ఆయకట్టుదారులు సంతకాల సేకరణతో దరఖాస్తులు అందించగా, వ్యతిరేక వర్గీయులు 169 మందితో కూడిన వినతిని కోరుకొండ పెంటారావు, ఎంపీడీవోకు అందజేశారు. దీంతో బహిరంగ గ్రామసభ ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పహరా కాశారు. ఈ గ్రామసభలో సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపిపి చింతల బుల్లిలక్ష్మి, ఇంచార్జ్ ఈఓపిఆర్డి జిఎస్.నళిని, అనకాపల్లి రూరల్ సీఐ ఎ రవికుమార్, ఎస్సైలు ధనుంజయ్, సింహాచలం, నాగేంద్ర పాల్గొన్నారు.

భార్య మెడకు చున్నీ బిగించి హత్య చేసిన భర్త

ప్రజాశక్తి- మునగపాక రూరల్

కట్టుకున్న భార్య మెడకు చున్నీతో బిగించి హత్య చేసిన సంఘటన మండలంలోని తోటాడ గ్రామ ఎస్సీ కాలనీలో మంగళవారం కలకలం రేపింది. యలమంచిలి సిఐ గఫూర్ కథనం ప్రకారం.... తోటాడ ఎస్‌సి కాలనీకి చెందిన కొత్తలంక నూక అప్పారావు, తన భార్య కొత్తలంక దీనకుమారి (28)ని తరచూ అనుమానిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో గత శనివారం రాత్రి వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. ఆదివారం గ్రామ పెద్దల సమక్షంలో పరిష్కారం కూడా జరిగింది. అయితే మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో నూక అప్పారావు తన భార్య దీనకుమారి మెడకు చున్నీ బిగించి హత్య చేశారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మునగపాక పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించి వివరాలు సేకరించారు. నిందితుడు పోలీసులకు లొంగిపోయాడు. మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ గఫూర్

గ్రామ వాలంటీరు పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీ అయిన వాలంటీర్ల నియామకానికి ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో కె.శశిదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్లె గ్రామ సచివాలయ పరిధిలో -2, ఆనందపురం-1, చౌడువాడ- 2 , ఆర్‌వై అగ్రహారంలో -1 వాలంటరీ పోస్టులను ఆయా రిజర్వేషన్ల ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 26 , 27 తేదీల్లో దరఖాస్తుల పంపాలని కోరారు.

కశింకోట : మండలంలోని సోమవారం గ్రామంలో-2, వెదురుపర్తి, త్యేగాడ గ్రామాల్లో ఒక్కో వాలంటీరు పోస్టులకు ఈనెల 27లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ వివి రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు గ్రామస్తులై, 18 నుండి 35 సంవత్సరాల లోపు వయస్సు ఉండి, పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు ఈ నెల 31న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

ఏటికొప్పాక బొమ్మలకు అంతర్జాతీయ మార్కెట్ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే ఏటికొప్పాక బొమ్మలకు అంతర్జాతీయ స్థాయి మార్కెట్ సౌలభ్యాలు కలిగించాలని అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి కోరారు. పార్లమెంటు సమావేశాలు జీరో అవర్‌లో ఆమె మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా ఏటికొప్పాక బొమ్మల ప్రాధాన్యత గురించి వివరించారు. పిల్లల అభిజ్ఞ, సమగ్ర అభివృద్ధిలో బొమ్మలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. సింధు నాగరికత కాలం నుండి బొమ్మలు కూడా భారతీయ సంస్కృతిలో భాగమయ్యాయని, భారతదేశంలోని బొమ్మల మార్కెట్ ప్రధానంగా దిగుమతి చేసుకున్న ఉత్పత్తులచే ఆధిపత్యం చెలాయిస్తుందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కొండపల్లి, ఏటికొప్పాక గ్రామాల్లోని బొమ్మలు భారతదేశంలో, ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయని గుర్తు చేశారు. ఈ గ్రామాల్లో ఉపాధిని సృష్టించడంలో, స్థానిక ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో బొమ్మల తయారీ సామర్ధ్యాన్ని చూపుతాయని తెలిపారు. అందుకు పరిశ్రమ అంతర్జాతీయ మార్కెట్లలో పోటీపడే సామర్థ్యాన్ని కలిగి ఉండాలన్నారు.

రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : భారత ప్రభుత్వ మహిళ శిశుఅభివృద్ధి శాఖ 2024 సంవత్సరపు రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిస్వార్థ సేవ, అనితర ధైర్య సాహసాలు ప్రదర్శించిన బాలబాలికలు, ఆటలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ పర్యావరణం, సంస్కృతి, కళా రంగాల్లో వినూత్న ఆవిష్కరణలు చేసిన 18 సంవత్సరాల లోపు బాల బాలికలు దీనికి అర్హులని పేర్కొన్నారు. వారి తరపున వారి తల్లిదండ్రులు/ ఉపాధ్యాయులు/ అధికారులు/ ఇతరులు ఎవరైనా ఈ ఆగస్టు 31వ తేదీ లోగా http://awards.gov.in లో వివరాలు పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆధునిక నైపుణ్యతను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యార్థి దశలోనే ఆధునిక నైపుణ్యతను పెంపొందించుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైకుంఠరావు అన్నారు. స్థానిక డైట్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు మంగళవారం రివిట్ ఆర్కిటెక్చర్ వర్క్‌షాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని వర్క్ షాప్ లను నిర్వహిస్తామన్నారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ఎన్ రాము మాట్లాడుతూ ప్రతి సివిల్ ఇంజనీర్ ఆచరణాత్మక విద్యను అభ్యసించాలని, తక్కువ రోజుల్లోనే ఎక్కువ నేర్చుకోవాలని సూచించారు. సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు రివిట్ ఆర్కిటెక్చర్ పైన ఎన్నో అవకాశాలు ఉన్నాయని డైట్ ఐఈఐఐ కన్వీనర్ వై హేమంత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డిసి ట్రైనర్ దాలి నాయుడు సివిల్ ఇంజనీరింగ్ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27న కేన్సర్ నివారణపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రపంచ తల, మెడ కేన్సర్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న శ్రీగౌరీ గ్రంధాలయంలో కేన్సర్ నివారణ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ముఖ్యఅతిథులుగా హెూమీ బాబా క్యాన్సర్ హాస్పటల్, పరిశోధనా కేంద్రం (అగనంపూడి) డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ మహంతశెట్టి, ప్రివెంటివ్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ డోల్‌రోసా ఫెర్నాండజ్ హాజరవుతారని పేర్కొన్నారు. సదస్సుకు 30 ఏళ్ల పైబడిన వారు హాజరు కావచ్చని, వివరాలకు 92471 66511 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలని కాండ్రేగుల వెంకటరమణ విజ్ఞప్తి చేశారు.

90అడుగుల రోడ్డు విస్తరణకు సుముఖత

- కోర్టుకు వెళ్లిన బాధితుల ఇంటింటికి ఎమ్మెల్యే గణేష్

- పూటకో మాట, రోజుకో నిర్ణయంపై నిర్వాసితుల నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నంలో మెయిన్ రోడ్డు విస్తరణకు సానుకూల పరిష్కారం చూపే దిశగా ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ చొరవ చూపుతున్నారు. వంద అడుగుల రోడ్డు విస్తరణపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేసి కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో, జటిలమౌతున్న సమస్య పరిష్కారానికి మధ్యేమార్గంగా 90అడుగుల విస్తరణకు నిర్ణయించి, దీనిపై కోర్టును ఆశ్రయించిన నిర్వాసితుల ఇళ్లకు నేరుగా వెళ్లి ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. మంగళవారం ఉదయం కోర్టుకు వెళ్లిన భవనాల యజమానులు అందరు ఇళ్లకు వెళ్లిన ఎమ్మెల్యే గణేష్, రోడ్డు విస్తరణ ఆవశ్యకతను వివరించే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్లు తమరాన అప్పలనాయుడు, కోనేటి రామకృష్ణ, కౌన్సిలర్లు, గుడబండి నాగేశ్వరరావు వెళ్లి భవన యజమానులను ఒప్పించే ప్రయత్నం చేశారు కొంతమంది సానుకూలంగా స్పందించినప్పటికీ, మరికొందరు వ్యవహారం కోర్టులో ఉన్నందున తర్వాత మాట్లాడదామని సున్నితంగా తిరస్కరించారు. ఇంకొందరు కోర్టులోనే వ్యవహారం తేల్చుకుందామంటూ మొండికేశారు. దీంతో 90 అడుగుల మేర రోడ్డు విస్తరణకు అందరూ కలిసి రావాలని ఎమ్మెల్యే గణేష్ పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే తీరుపై విమర్శలు

నర్సీపట్నం రోడ్డు విస్తరణలో అధికారపార్టీ నేతలు, ముఖ్యంగా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వస్తున్నాయి. ముందుగా 80అడుగులమేర విస్తరణకు నిర్ణయిస్తే, భవిష్యత్ అవసరాలంటూ వంద అడుగుల విస్తరణ చేపట్టాలని ప్రతిపాదించి, కౌన్సిల్‌లో తీర్మానించిన నివేదించిన అధికార పార్టీ, అప్పట్లో తీవ్రంగా నష్టపోతున్న పలువురు నిర్వాసితులు మొరపెట్టుకున్నా ససేమిరా అంటూ దూకుడుగా ముందుకు సాగారు. దీంతో బాధితులు ముఖ్యమంత్రితోపాటు పార్టీ పెద్దలు వైవి.సుబ్బారెడ్డి, వి.విజయసాయిరెడ్డి తదితరులకు తమ గోడును వినిపించి, వారి నుంచి సానుకూల స్పందన కోసం ఎదురుచూస్తున్నారు. ఢిల్లీ వెళ్లిన సిఎం జగన్‌ను అక్కడకు వెళ్లి కలిసిన నిర్వాసితులు తమ గోడు వెల్లబుచ్చారు. అధికారపార్టీ పెద్దల నుంచి ఎటువంటి స్పందన రాకముందే, దూకుడుగా రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేయడం, పనులు చేపట్టడం చకచకాచేయించారు. ప్రభుత్వ స్థలాల్లో 100 అడుగుల మేర నిర్మాణాల్ని కూలదోసేశారు. ఈలోగా కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఇపుడు కిందకు దిగొచ్చి, 90 అడుగుల విస్తరణ అంటూ కొత్తపాట పాడడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వంద అడుగుల విస్తరణ కోసం కూల్చేసిన భవనాలు, అక్కడ నష్టపోయిన నిర్వాసితులు, చిరువ్యాపారులకు ఏం సమాధానం చెబుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇపుడు కొత్తగా నిర్ణయించిన ప్రకారం 90అడుగులకు విస్తరణ చేపడితే, కూల్చిన భవనాలకు పరిహారం ఇస్తారా అంటూ నిరసిస్తున్నారు. అన్నీ ఒకే అయిన తర్వాత భవనాలను కూలగొడితే సరిపోయేదనే అభిప్రాయం కూడా వ్యక్తమౌతోంది. మొత్తానికి రోజుకో నిర్ణయంతో నర్సీపట్నం మెయిన్‌రోడ్డు విస్తరణను చివరకు గాలికొదిలేస్తారేమోనని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

నిర్వాసితుల అభ్యర్ధన మేరకు విస్తరణ కుదింపు

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నిర్వాసితుల అభ్యర్ధన, వారి బాధలను దృష్టిలో పెట్టుకుని నర్సీపట్నం మెయిన్‌రోడ్డు విస్తరణను 90అడుగులకు కుదించాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే పెట్లఉమాశంకర్ గణేష్ వెల్లడించారు మంగళవారం స్థానిక వ్యాపారి వెలగా నారాయణరావు ఇంటిదగ్గర విలేకర్లతో మాట్లాడుతూ, కొందరు చిరువ్యాపారులు, భవన యజమానుల వినతి మేరకు రోడ్డు విస్తరణను పది అడుగులు తగ్గించాలని నిర్ణయించామని, ఇప్పటికైనా అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకష్ణ గొలుసు నరసింహమూర్తి, తమరాన నాయుడు పాల్గొన్నారు

డెంగీ కేసు నమోదుతో అప్రమత్తం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉపమాక గ్రామంలో డెంగీ కేసు నమోదుతో వైద్యఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఈనెల 14న ఉపమాకకు చెందిన వృద్ధుడు అనారోగ్య సమస్యతో విశాఖ కెజిహెచ్‌లో జాయిన్‌కాగా, తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఆయనను ఈనెల 19న పరీక్షించగా డెంగీగా నిర్ధారణ అయ్యిందని ఆరోగ్యశాఖ అధికారులు అంటున్నారు. దీంతో డెంగీ బాధితుని ఇంటి పరిసరాలు, చుట్టుపక్కల ఇళ్లల్లోనూ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు. దోమలు, వాటి లార్వాలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిశుభ్రత పాటించాలని, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమ సమాచారం ఇవ్వండి

ప్రజాశక్తి-నక్కపల్లి : 2019 నుంచి ఇప్పటివరకు గడచిన నాలుగున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమాచారం ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ కోరారు ఈ మేరకు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాల కోసం ఎంపిడిఒ శ్రీనివాసరావును కలిసి దరఖాస్తు చేశారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల వివరాలు, పెండింగ్‌లో ఉన్ననీరు చెట్టు బిల్లుల సమాచారం, వైఎస్ఆర్ బీమాలో లబ్ధి సమాచారం, కొత్తగా మంజూరైన, తొలగించిన పలు పింఛన్ల వివరాలు, వైఎస్ఆర్ ఆసరాలో డ్వాక్రా మహిళలకు అందించిన రుణమాఫీ సమాచారం, కాపునేస్తం, ఇబిసి నేస్తం, ఇంకా ఇతరత్రా సంక్షేమ పథకాల సమాచారం అందించాలని కోరారు.తహశీల్దార్ అంబేద్కర్‌ను కలిసి, జగనన్న లేఅవుట్‌లలో ఇచ్చిన ఇళ్లపట్టాలు, ఇళ్ల మంజూరు వివరాలను సమగ్రంగా అందిచాలని కోరారు. టిడిపి పట్టణ శాఖ అధ్యక్షులు అడ్డూరి లోవ రాజు, మీసాల ఉమామహేశ్వరరావు, కొప్పిశెట్టి వీర బాబు, పల్లా రాంబాబు, ఈగల గూడెపు పాల్గొన్నారు.

వరి నారుమడి సస్యరక్షణపై పొలంబడి

ప్రజాశక్తి-ఎస్ రాయవరం : ఖరీఫ్ సీజన్‌లో వరి నారుమడిలో సస్యరక్షణ చర్యలపై రైతులకు పొలంబడిలో అవగాహన కల్పించినట్లు మండల వ్యవసాయాధికారి సౌజన్య తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం పెట్టుగోళ్ళపల్లి గ్రామంలో ఆరోగ్యవంతమైన నారు పెంచటానికి రైతులకు పలు సూచనలు చేశారు. ముందుగా పొలాలలోని ఆకుమడులను పరిశీలించి, అనంతరం రైతులతో సమావేశమయ్యారు.

రోడ్డు నిర్మించాలని గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి -కొత్తకోట :రావికమతం మండలం చీమలపాడు శివారు జెడ్.జోగంపేట నుండి అజయ్ పురం మీదిగా సీతబందలకు వెళ్లే రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అజయ్‌పురం గ్రామస్తులు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ చోడవరం, మాడుగుల నియోజకవర్గాల గిరిజన గ్రామాలను కలిపే జెడ్ జోగంపేట నుండి అజయ్‌పురం మీదుగా మాడుగుల మండలం ఆవురవాడ పంచాయతీ సీతబందలు వరకు లింక్‌రోడ్డు నిర్మిస్తే 30 గిరిజన గ్రామాల ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా వర్షాల సీజన్‌లో అజయ్‌పురం గ్రామస్తులెవరికైనా అనారోగ్యం చేస్తే డోలి కట్టుకొని రెండు కిలోమీటర్ల దూరం జెడ్ జోగంపేట వరకు డోలిపై మోసుకొచ్చే పరిస్థితి ఉందన్నారు. గతంలో నిధులు మంజూరు చేశామని చెప్పిన నేతలు నేటికీ పనులు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందన్నారు తక్షణమే ఉప ముఖ్య మంత్రి బూడి ముత్యాలనాయుడు చొరవ చూపి, రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం అధ్యక్షులు పాంగి చంద్రయ్య. పాంగి విజయకుమార్, గంగరాజు. పి. సూరిబాబు గ్రామ మహిళలు పాల్గొన్నారు

సిపిఎం ఆధ్వర్యాన ధర్నాచేస్తున్న అజయపురం గిరిజనులు

ఓటర్ల జాబితా సవరణకు సహకరించండి

గొలుగొండలో నేతలతో మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి -నక్కపల్లి :ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 21 నుండి ప్రారంభమైన ఓటరు జాబితాల సవరణకు ఇంటింటా సర్వేకు రాజకీయ పక్షాల నేతలు సహకరించాలని పాయకరావుపేట నియోజకవర్గం ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారి కెవి.రామలక్ష్మి కోరారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఓటరు జాబితాల పరిశీలనకు ఇంటింటికి వెళ్లే బిఎల్ఒలతోపాటు రాజకీయ పార్టీల ఏజెంట్లు కూడా వెళ్లి, అక్కడ ఓటర్ల తొలగింపు, మార్పులు చేర్పులను నిర్ధారించాలన్నారు. అర్హులైన వారి పేర్లను ఓటర్లుగా నమోదు చేయాలన్నా సమావేశంలో నాలుగు మండలాల తహశీల్దార్‌లు అంబేద్కర్, జయప్రకాశ్, జానకమ్మ, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

గొలుగొండ : ఓటర్ జాబితా సవరణకు ఇంటింటి సర్వేకు అన్ని పార్టీల నేతలు సహకరించాలని తహశీల్దార్ జి.ఆనందరావు కోరారు. మంగళవారం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. సర్వేలో పాల్గొనేందుకు ఒక్కో పార్టీ నుంచి ఒక్కొక్కరినే అనుమతిస్తామని, పార్టీల బూత్ కన్వీనర్లుకు ఆయా పార్టీల గుర్తింపుకార్డులు ఉండాలన్నారు. సర్వేలో దరిదాపుల్లోకి వాలంటీర్లు రావద్దని సూచించారు. నెలరోజులపాటు మండలంలోని 56 పోలింగ్ బూత్‌ల పరిధిలో జరిగే సర్వే సజావుగా సాగేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిటి సుధావాణి, ఆర్ఐ నాగరాజు, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, టిడిపి జిల్లా కన్వీనర్ గండేపల్లి రాము, సిపిఐ మండల కన్వీనర్ మేకా భాస్కర్ రావు పాల్గొన్నారు.

సంఘ సభ్యుని కుటుంబానికి అండ

ఆర్ధికసాయం అందిస్తున్న కొబ్బరి దింపు కార్మికులు

ప్రజాశక్తి -యస్ రాయవరం : మృతి చెందిన సంఘ సభ్యుడి కుటుంబానికి మండలంలోని గుర్రాజుపేట శ్రీ విఘ్నేశ్వర సత్యదుర్గ కొబ్బరిదింపు కార్మిక సంఘ సభ్యులు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. మంగళవారం యాతసంఘం భవనం వద్ద ప్రత్యేక సమావేశమైన సంఘ సభ్యులు, ఇటీవల సంఘ సభ్యుడు గండిబోయిన పైడిదొర అలియాస్ పైడిరాజు మృతి చెందగా, ఆయన భార్య భవానీకి రూ.40 వేలు ఆర్థికసాయాన్ని చెక్‌గా అందజేసినట్లు సంఘంఅధ్యక్షుడు మనసా సత్తిబాబు తెలిపారు. నెలరోజుల కిందట గుంటూరు జిల్లాలో కల్లుగీత సామాజిక వర్గానికి చెందిన 10వ తరగతి విద్యార్థి ఉప్పల అమర్‌నాథ్ గౌడ్‌పై పెట్రోల్ పోసి హత్యచేసిన కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించి, నిందితుడికి మరణశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. అమర్‌నాథ్ మృతికి యాత సంఘ సభ్యులు, మహిళలు నివాళులర్పించారు. సమావేశంలో సంఘ అధ్యక్షుడు మనసా సత్తిబాబు, ఉపాధ్యక్షుడు గండిబోయిన నూకరాజు, సంఘ గౌరవాధ్యక్షుడు గుత్తుర్తి పాండురంగ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్ధికసాయం అందిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నాతవరం మండలంలో గునుపూడి గ్రామంలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షులు పోలుపర్తి సాయి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.20వేల నగదుతో పాటు ఒక గ్యాస్ సిలిండర్, నిత్యవసర సరుకులు అందించి ఆదుకున్నారు. కార్యక్రమంలో దేవుడు కొండబాబు, నాగశివ గణేష్, రాజకుమార్, గవరెడ్డి వెంకటరమణ, గ్రామ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి చేయకుంటే ఆమరణదీక్ష

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నాతవరం తాండవ రోడ్డును 15 రోజుల్లో అభివృద్ధి చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన వీర సూర్యచంద్ర హెచ్చరించారు. మంగళవారం నాతవరం మండల పార్టీ అధ్యక్షులు వెలగల వెంకటరమణ ఆధ్వర్యంలో నాతవరం, తాండవ రోడ్డును అభివద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర చేపట్టారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా 9 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టి, రోడ్డు అభివృద్ధి చేయాలని నినాదాలు చేసారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ నాలుగేళ్లలో నియోజకవర్గంలో రోడ్డలను అభివృద్ధి చేయడంలో నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్ ఘోరంగా విఫలం చెందారని ఆరోపించారు. కార్యక్రమంలో అద్దేపల్లి గణేష్, బైన మురళి, భాస్కర్, నాయుడు, మారిశెట్టి రాజా, గూడెపు తాతబాబు, చినరాజు, బద్రీనాథ్, రేగుబల్ల శివ, వాసం వెంకటేష్, పాల్గొన్నారు.

పలుచోట్ల భారీ వర్షం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో మంగళవారం పలు గ్రామాల్లో ఉదయం నుంచి భారీగా వర్షం కురిసింది. కృష్ణదేవిపేట, ఏఎల్‌పురం, కొంగసింగి, లింగంపేట, కొత్తమల్లంపేట, చోద్యం, గొలుగొండ తదితర ప్రాంతాల్లో ఉదయం వర్షం కురుస్తూనే ఉంది. ఈ వర్షం దమ్ములు పట్టడానికి ఉపకరిస్తుందని పలువురు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మేజర్ పంచాయతీ ఎఎల్‌పురంలో డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో వర్షంతో కాలువల్లోని మురుగునీరంతా రోడ్లపైకి చేరి నిలిచిపోయింది. స్థానిక బస్‌స్టేషన్‌లో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

మణిపూర్ మారణహోమానికి బిజెపిదే బాధ్యత

వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ఎగసిపడ్డ నిరసన జ్వాలలు

అనకాపల్లిలో ప్రజాసంఘాల ఆందోళనలో మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

మణిపూర్‌లో మంట రేపిన బిజెపియే అక్కడి ఘటనలకు బాధ్యత వహించి, సద్దుమణిగే చర్యలు చేపట్టాలని పలు రాజకీయపార్టీలతోపాటు ప్రజా సంఘాలు, పలు అసోసియేషన్లు నిరసన చేపట్టాయి. మణిపూర్ శాంతిభద్రతల స్థాపనలో విఫలమైందని ఆక్షేపించాయి. తక్షణమే తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశాయి.

ప్రజాశక్తి యంత్రాంగం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మణిపూర్‌లో అకృత్యాలు, హింసాకాండపై షిప్ యార్డ్ గేటు వద్ద కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సిఐటియు, ఐఎన్‌టియుసి, ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఒబిసి అసోసియేషన్ కార్యకర్తలు పాల్గొన్నారు. గుర్తింపు యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎస్.ప్రసాద్, కోశాధికారి బిఎస్ఎన్.రాజు, ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి పి.శ్రీరామమూర్తి, అధ్యక్షులు పిజెసిహెచ్.బోస్, ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్, అధ్యక్షులు అప్పలకొండ, ఒబిసి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ధనుంజయరావు, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు కె.జానకిరామ్, లక్ష్మీనాయుడు, విక్టరీ ప్రసాద్, శామ్యూల్, కె.రామచంద్రరావు, కె.గోవింద్ మాట్లాడారు.

యుటిఎఫ్ ఆధ్వర్యాన..

మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అల్లర్లను ఖండిస్తూ యుటిఎఫ్ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్, పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాగమణి, పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాన అప్పారావు, కోశాధికారి కె.రాంబాబు, టి.జగన్ పాల్గొన్నారు.

లీగల్ : మణిపూర్‌లో జరుగుతున్న దమనకాండను, మహిళల పట్ల దారుణాలను ఖండిస్తూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, విశాఖపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన జిల్లా ప్రధాన న్యాయస్థానం ప్రధాన ద్వారం వద్ద మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎల్ రాష్ట్ర అధ్యక్షులు కెఎస్.సురేష్‌కుమార్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నూకల వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బగాది తులసీదాస్ మాట్లాడుతూ, తక్షణమే సుప్రీంకోర్టు ఆధ్వర్యాన కమిటీ వేసి తెగల మధ్య చిచ్చుపెట్టిన నాయకులను శిక్షించాలని భారత ప్రధాన న్యాయమూర్తిని కోరారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.ఆనందరెడ్డి, వివిధ న్యాయవాద సంఘాల నేతలు గుడిపల్లి సుబ్బారావు, ఐఎం అహ్మద్, సురేష్, లక్ష్మీరాంబాబు, హేమామాలిని, సిహెచ్. రాం బాబు, లత, సిహెచ్.భాస్కరరావు, పలక శ్రీరామ్‌మూర్తి, నమ్మి సన్యాసిరావు మహిళ న్యాయవాదులు పాల్గొన్నారు

సీతమ్మధార : సిపిఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యాన పౌరగ్రంథాలయంలో మణిపూర్ ఘటనపై చర్చాగోష్టి నిర్వహించారు. టిడిపి, సిపిఎం, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, లోక్‌సత్తా, మహిళా సమాఖ్య నాయకులు మాట్లాడారు. మణిపూర్‌లో రెండు నెలలకుపైగా జరుగుతున్న హింసాకాండను అక్కడి బిజెపి ప్రభుత్వమే నడిపిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.నజీర్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి వై.కొండయ్య, కె శంకరరావు (ఎంసిపిఐ యు), కె.దేవా (సిపిఐ ఎం ఎల్ ప్రజా పోరు), శ్రీనివాస్ (భారత బచావో), ఇ.చంద్రశేఖర్ (ఆప్), ఎస్.సుధాకర్ (కాంగ్రెస్), ఎంఎస్ఎన్.మూర్తి (లోక్‌సత్తా), అనురాధ (హెచ్‌ఆర్ఎఫ్), ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.విమల, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వై.రాంబాబు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, ఎస్‌కె.రెహమాన్ (ఇన్సాఫ్), జి.రాంబాబు (డిహెచ్‌పిఎస్), సిఎన్ క్షేత్రపాల్, ఎన్.అప్పన్న, రాంప్రభు పాల్గొన్నారు

ఉక్కునగరం : మణిపూర్‌లో మారణహోమాన్నిఆపాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ సిఐటియు ఆధ్వర్యాన నిరసన కార్యక్రమా లను చేపట్టారు. ఈ కార్యక్రమం లో సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి రామస్వామి, నాయకులు బి.అప్పారావు, మహేష్, వివి.రమణ పాల్గొన్నారు.

అనకాపల్లి : మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీలపై జరుగుతున్న మారణ హోమాన్ని వెంటనే అరికట్టాలని కోరుతూ మంగళవారం అనకాపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ధర్నా చౌక్ వద్ద యుటిఎఫ్, సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ మణిపూర్‌లో దాడులను అదుపు చేయడంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, దేశ ప్రధాని విఫలమయ్యారని విమర్శించారు. యుటిఎఫ్ నేతలు జిఎస్ ప్రకాష్, గేదెల శాంతి దేవి, మామిడి అరుణ, కరుణ జ్యోతి, సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు ఆర్. శంకర్రావు గంటా శ్రీరాం, ఎ.బాలకృష్ణ, వివి.శ్రీనివాసరావు, నాయన బాబు, అజయ్, డిడి. వరలక్ష్మి పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న హింస, అకృత్యాలను ఆపాలని, అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సీఐటీయు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డులో మంగళవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో మారణహోమాన్ని అరికట్టడంలో బీజేపీ ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, సీఐటీయూ నాయకులు ఆర్.శంకరరావు, వివి శ్రీనివాసరావు, ఎస్.బ్రహ్మాజీ, రైతు నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, జగ్గ అప్పారావు, ఎం.అప్పలరాజు, ఎ.బాలకృష్ణ, కాండ్రేగుల రాము, కర్రి అప్పారావు పాల్గొన్నారు.

విశాఖలో న్యాయవాదుల నిరసన

సిపిఐ నిరసన

నర్సీపట్నం టౌన్ : మణిపూర్‌లో రెండునెలలకు పైగా సాగుతోన్న మారణహోమాన్ని అక్కడ బిజెపి ప్రభుత్వమే నడిపిస్తోందని భారత జాతీయ మహిళా సమాఖ్య నిజనిర్ధారణ కమిటీ వెల్లడించిన నేపథ్యంలో, దీనికి బాధ్యత వహిస్తూ అక్కడ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ రాజీనామా చేయాలని సిపిఐ, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం మణిపూర్‌లో దుర్మార్గాన్ని ఖండిస్తూ, బాధితులకు సంఘీభావంగా సిపిఐ ఆధ్వర్యంలో నర్సీపట్నం అబీద్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. సిపిఐ నేతలు మాకిరెడ్డి రామా నాయుడు, జి గురుబాబు, ఎల్‌వి.రమణ, వ్యవసాయ కార్మిక సంఘం నేతకొండలరావు, విదనం రాష్ట్ర నేత ఎర్రంశెట్టి పాపారావు, ముఖ్య సలహాదారు ఎల్లాజీ, జి.ఫణీంద్ర, దళిత నాయకుడు మర్ర గోపి పాల్గొన్నారు.

అనకాపల్లి : మణిపూర్ హింసా కాండకు అక్కడి బిజెపి ప్రభుత్వమే కారణమని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. మణిపూర్ ఘటనకు నిరసనగా స్థానిక నెహ్రూ జంక్షన్ అంబేద్కర్ విగ్రహం ముందు సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు రాజాన దొరబాబు, రెడ్డిపల్లి అప్పలరాజు, వైయన్ భద్రం, చెల్లూరి నాగరాజు, మునగపాక సత్తిబాబు, వియ్యపు రాజు, ఎస్‌విఎస్ సాయి, కె.వీరాచారి, వీరు యాదవ్, సతీష్, గణేష్, వంశి పాల్గొన్నారు.

షిప్‌యార్డు గేటు వద్ద కార్మిక, ప్రజా సంఘాల నిరసన

పౌరగ్రంథాలయంలో చర్చాగోష్టిలో అఖిలపక్ష పార్టీల నేతలు

మునగపాకలో రైతు సంఘం ఆధ్వర్యాన రాస్తారోకో

నర్సీపట్నంలో నిరసన చేపడుతున్న సిపిఐ శ్రేణులు

ఓటరు జాబితా సర్వే పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని దేవవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఓటర్ జాబితా సర్వే తీరును పార్టీ నాయకులతో కలిసి తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత పరిశీలించారు. ఓటర్ జాబితా సర్వేలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు ఇంటింటా సర్వే చేపడుతుండగా, .సర్వే జరుగుతున్న తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. పార్టీ నాయకులు సర్వేలో తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులు పక్కాగా సాగేలా పర్యవేక్షించాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులు దేవర సత్యనారాయణ, గింజాల లక్ష్మణరావు పాల్గొన్నాం

సర్వే తీరును పరిశీలిస్తున్న టిడిపి మాజీ ఎమ్మెల్యే అనిత

అణుకు గిరిజనం దీక్షలతో అధికారుల్లో కదలిక

కలెక్టర్ ఆదేశాలతో గ్రామ సందర్శన
సమస్యలు, ఇతరత్రా వివరాలపై ఆరా
ఉన్నతాధికారులకు నివేదిస్తామని భరోసా

దీక్షా శిబిరం వద్ద సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

అణుకులో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ

ప్రజాశక్తి - కోటవురట్ల : రోడ్డు, పాఠశాలతోపాటు ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించాలని అణుకు కొండ్రు జాతి గిరిజనులు చేపడుతున్న నిరవధిక దీక్షలకు అధికారుల్లో కదలిక వచ్చింది. జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఆదేశాలతో మంగళవారం మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారుల బృందం అణుకు గ్రామాన్ని సందర్శించింది. కొద్దిదూరం ఆటోలో, అక్కడి నుంచి కాలినడకన ఇలా నానా అవస్థలు పడుతున్న గ్రామానికి చేరుకున్న అధికారులు, అక్కడి ప్రజల సమస్యలను స్వయంగా పరిశీలించడంతోపాటు స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

గ్రామంలో ఎంత మంది జనాభా ఉన్నారు. వారి ఆర్థిక పరిస్థితులు, సహజవనరులు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి, గ్రామంలోని విద్యార్థులు, చిన్న పిల్లలు ఇతరత్రా సమగ్ర వివరాలు సేకరించారు. గ్రామంలో 50 కుటుంబాలు, 200 మంది వరకు జనాభా, అందులో 30మంది విద్యార్థులు ఉన్నట్లుగుర్తించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించి వారి సమస్యలను సైతం తెలుసుకున్నారు. గ్రామం నుంచి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లివస్తున్న విద్యార్థులు అవస్థలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రహదారి, పాఠశాల భవనం, విద్యుత్ సౌకర్యం, ఇళ్ల మంజూరు వంటి సమస్యలను ప్రధానంగా స్థానికులు అధికారులకు మొరపెట్టుకున్నారు. అనంతరం ప్రధాన రహదారికి చేరుకొని దీక్ష శిబిరం వద్ద 19వ రోజు దీక్షల్లో పాల్గొన్న గిరిజనులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అణుకు గిరిజన గ్రామంలోని పరిస్థితులు, ప్రజల డిమాండ్లను జిల్లాస్థాయి ఉన్నత అధికారులకు నివేదిస్తామని దీక్షల్లో పాల్గొన్న గిరిజనులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు, తహశీల్దారు జానకమ్మ, పిఆర్ డిఇఇ కుమారరాజు, ఎంఇఒ టి రామారావు, డిటి సోమశేఖర్, ఇఒపిఆర్‌డి సుబ్రహ్మణ్యం, అటవీ శాఖ సిబ్బంది విశ్వేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి నరసింహ, విఆర్ఒ రమేష్ , ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది, స్థానిక పోలీస్ అధికారులు, సిపిఎం నేత డేవిడ్‌రాజు ఉన్నారు.